విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: విద్యార్థులు విద్యతోపాటు క్రీడలపై దృష్టి సారించాలని ఆంధ్ర క్రికెట్ కోచ్ కుప్పల శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన ఆదిత్య పాఠశాలలో క్రీడా మైదానం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు క్రీడలపై అవగాహన కల్పించి విద్యార్థులతో క్రికెట్, సెటిల్, టెన్నిస్ తదితర ఆటలను ఆడించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శిమ్మ అప్పన్న, కరస్పాండెంట్ చింతు రాజారావు, ప్రిన్సిపాల్ గొద్దు ధర్మేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సెంటెన్స్‌లో వేధింపులు షరా మామూలే..

- నిరంతరం వేధింపులే వారి లక్ష్యం
- తల్లిదండ్రులదీ అదే స్థితి

- అక్రమ వసూళ్లకు లెక్కలున్నాయి: ప్రిన్సిపాల్

సెంటెన్స్ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులపై యాజమాన్యం వేధింపుల పర్వం కొనసాగుతుంది. బాలికలకు బొట్టు గాజులు వేసుకోవద్దని మౌఖిక ఆదేశాలు జారీ చేస్తే వాటిని ఉపాధ్యాయులు తూచా తప్పకుండా పాటించటం చర్చనీయాంశంగా మారింది. నెలసరి సమయంలో వైద్యున్ని సంప్రదించి ఆసుపత్రిలో చేరితే దానికి కూడా అభ్యంతరాలు వ్యక్తం చేసిన యాజమాన్యం ఆ వైద్యుడు ఇచ్చే సర్టిఫికెట్లు చెల్లదని వేధించటంతో తల్లిదండ్రులు అవాక్కయ్యారు.

విశాలాంధ్ర-ఆమదాలవలస: సెంటెన్స్ ప్రైవేటు పాఠశాల యాజమాన్యం విద్యార్థులను యాజమాన్యం వేధిస్తున్నప్పటికీ తల్లిదండ్రులు మాత్రం అక్కడే వారి పిల్లలను చదివించాలని ప్రతిన పూనడాన్ని యాజమాన్యం ఆసరాగా తీసుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్టు తెలిసింది. జూలై నెలలో విద్యార్థులు ఆలస్యంగా వస్తున్నారని గేటుకు తాళాలు వేసి మూడు రోజుల పాటు వారిని బయట ఉంచారు. తల్లిదం డ్రులంతా ఏకమై వివరణ కోరడంతో తిరిగి క్లాసులకు అనుమతించారు. పరిస్థితి తిరిగి పునరావృతం అయింది. విద్యాశాఖ అధికారుల ఆదేశాలను సైతం బేఖాతర్ చేస్తూ ఇష్టారాజ్యాంగ వ్యవహరించినప్పటికీ తల్లిదండ్రులు విద్యార్థులను అక్కడే కొనసాగించారు. అక్టోబర్ 10వ తేదీన పరీక్ష ఫీజులు చెల్లించలేదని విద్యార్థులను తిరిగి ఇంటికి పంపించేశారు. అప్పుడు కూడా విద్యాశాఖ అధికారులు నోరు మెదపలేదు. ఇంత జరుగుతున్న విద్యార్థుల తల్లిదండ్రులలో కనీస చలనం లేకపోవడంతో యాజమాన్య నిర్లక్ష్య వైఖరి రోజురోజుకి పెచ్చు మీరుపోతుంది.

అక్రమ వసూళ్లకు లెక్కలు ఉన్నాయి: ప్రిన్సిపాల్

సెంటెన్స్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల వద్ద నుండి ఫీజులు మినహా ఇతర వసూళ్లకు సంబంధించి ప్రతి పైసాకి లెక్కలు ఉన్నాయని ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు. టీచర్స్ డే నాడు సుమారు 1200 మంది విద్యార్థుల నుంచి 70 రూపాయలు వంతున వసూలు చేసి కనీసం విద్యార్థులకు చాక్లెట్ కూడా ఇవ్వకుండా వ్యవహరించారు. మేము వసూలు చేయలేదని ముందు మొండికేసినప్పటికీ విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నించడంతో టీచర్స్ డేకి మాత్రమే వసూలు చేశామని బహిర్గతం చేశారు. విద్యార్థుల వద్ద నుంచి అక్రమంగా వసూలు చేసే మొత్తాలకు సైతం లెక్కలు చూపుతున్నారు అంటే వారి విద్యా వ్యాపార ధోరణి ఏ మేరకు ఉందో అవగతం అవుతుంది. ఆ మొత్తానికి సంబంధించి కూడా లెక్కలు ఉన్నాయని ప్రిన్సిపాల్ చెప్పటం గమనార్హం. నవంబర్ ఒకటో తేదీలోగా 2025 -26 విద్యా సంవత్సరం గాను ఎల్కేజీ యూకేజీ విద్యార్థులు 50 రూపాయలు, ఒకటో తరగతి నుండి 5వ తరగతి వరకు 120 రూపాయల వరకు, ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు 200 రూపాయలు చెల్లించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వమే చెల్లించమని చెప్పింది అని మెసేజ్ చేయడం వెనక విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం మరోసారి వెలుగులోకి తెచ్చారు. నిజానికి ప్రభుత్వం ఒక్క 10వ తరగతి విద్యార్థులకు మాత్రమే 200 రూపాయలు చెల్లించాలని జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ మొత్తం విద్యార్థుల నుంచి వసూలు చేయటం వెనుక విద్యాశాఖ అధికారుల హస్తం లేకపోలేదని విమర్శలు ఉన్నాయి. ఏది ఏమైనప్పటికీ విద్యార్థులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని తల్లిదండ్రులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఆచార్య ఎన్.జి.రంగా సేవలు మరువలేనివి

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: రైతు బాంధవుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, ప్రముఖ పార్లమెంటీరియన్ ఆచార్య ఎన్.జి.రంగా సేవలు మరువలేనివని ఇంటాక్ జిల్లా శాఖ అదనపు కన్వీనర్ వావిలపల్లి జగన్నాథ నాయుడు అన్నారు. ఆచార్య రంగా జయంతి సందర్భంగా స్థానిక గాంధీ మందిరం, స్వాతంత్ర్య సమర యోధుల స్మృతి వనంలో ఏర్పాటైన కార్యక్రమంలో నాయుడు పాల్గొని ప్రసంగించారు. 1930 నుంచి స్వాతంత్ర్య సమరంలో భాగస్వామ్యమై జాతిని జాగృతం చేసిన మహానుభావుడుకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు సురంగి మోహనరావు, హారికా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వందేమాతరం 150 వసంతాల వేడుకలు

విశాలాంధ్ర - కొత్తూరు: స్థానిక విజ్ఞాన భారతి హై స్కూల్‌లో వందేమాతరం గీతం 150 వసంతాల వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రధానోపాధ్యాయులు కలమట శ్రీరాములు అధ్యక్షుతన జరిగిన ఈ వేడుకల్లో సామూహికంగా వందేమాతరం గీతాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆలపించారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు మాట్లాడుతూ వందేమాతరం గీతం స్వాతంత్ర్య సమరంలో భారతీయులని ఒకటిగా చేసిందన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన భారతీ అధ్యక్షులు లోతుగెడ్డ లక్ష్మి నారాయణ నాయుడు, రిటైర్డ్ హెచ్‌ఎం ఎద్దు దాసునాయుడు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధరను కల్పించండి

బీజేపీ సమన్వయకర్త డా. సలాన

విశాలాంధ్ర-మెలియాపుట్టి: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరను కల్పించాలని సివిల్ సప్లై ఎండీ ఢిల్లీరావును పాతపట్నం నియోజకవర్గ బీజేపీ సమన్వయకర్త డా. సలాన శరత్ కుమార్ కోరారు. పిడి మందస గ్రామంలో ఆయన స్వగృహంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిశాని మాట్లాడారు. ఇటీవల మొంథా తుఫాను నేపథ్యంలో పంటలకు చాలా వరకు నష్టం వాటిల్లిందని గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని, పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు డాక్టర్ సలాన తెలిపారు.

కళ్లేపల్లిలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్: కాకినాడ ఆదిత్య మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 ఆధ్వర్యంలో కళ్లేపల్లిలో వారం రోజులపాటు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు కళాశాల డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ తెలిపారు. శిబిరాన్ని సర్పంచ్ ప్రతినిధి గంగు నరేంద్ర, ఎంపీటీసీ ప్రతినిధి గంగు కిశోర్, మూకళ్ల శ్రీనివాసరావు, తాతబాబు, జయానంద్, శిమ్మ భీమారావు, నక్క సత్యనారాణ, వేణు ప్రారంభించి మాట్లాడారు. కాకినాడ ఆదిత్య మహిళా కళాశాల మా గ్రామాన్ని ఎంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని వాటిని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొదటి రోజులో భాగంగా గ్రామంలో ఉన్న ప్రతి ఇంటికి విద్యార్థినిలు వెళ్లి ప్రభుత్వ పథకాలు, విద్య, ఆరోగ్య విషయాలపై సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ పీఓలు హరి మానస, పైడిరాజు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

విశాలాంధ్ర-హిరమండలం/పాతపట్నం: పాతపట్నం మండలంలోని సింగపురం పంచాయతీ లాభర గ్రామానికి చెందిన కనపల మధు ఇటీవల రోడ్డు ప్రమాదంలో దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద ఘటనపై నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తక్షణమే స్పందించి టీడీపీకి అంకితభావంతో సేవలందించిన కనపల మధు పార్టీ కార్యకర్తల సంక్షేమ నిధికి సభ్యత్వం పొందుతూ 100/- రూపాయలు చెల్లించి ప్రమాద బీమా చేయించుకున్నారు. సీఎం నారా చంద్రబాబు ఆ కుటుంబానికి మంజూరు చేసిన రూ.5 లక్షల రూపాయల ప్రమాద బీమా సాయాన్ని శనివారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అందజేశారు. పార్టీ ఎల్లప్పుడూ కార్యకర్తల పక్షాన నిలుస్తుందని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డా. బీఆర్ఏయూలో 'హెర్బల్ గార్డెన్'

- స్థల పరిశీలన చేసిన రాష్ట్ర ఉన్నతాధికారుల బృందం

విశాలాంధ్ర - ఎచ్చెర్ల: సమాజహిత, ఆరోగ్యకరమైన ఔషధ మొక్కలను పది హెక్టార్లులో డా. బీఆర్ అంబేద్కర్ యూనివర్శిటీలో పెంచనున్నారు. దీనికోసం చేసిన హెర్బల్ గార్డెన్ ప్రతిపాదనలు పరిశీలనకు ఆంధ్ర ప్రదేశ్ ఔషధ, సుగంధ మొక్కల బోర్డు (విజయవాడ) అధికారులు వర్శిటీలో పర్యటించారు. క్యాంపస్‌లో అనువైన ప్రదేశాలను వర్శిటీ ఉన్నతాధికారులతో కలిసి సందర్శించారు. అనంతరం వర్శిటీ సెమినార్ హాల్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సైన్స్ కళాశాల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థుల నుద్దేశించి మాట్లాడారు. ఆంధ్ర ప్రదేశ్ ఔషధ, సుగంధ మొక్కల బోర్డు సీఈఓ ఎ.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఔషధ మొక్కలు పెంచడం వలన భావితరాలకు కాలుష్యరహిత సమాజాన్ని అందించిన వారమవుతామన్నారు. గంజాయి వంటి సాగుకు, వ్యసనాలకు యువతరం దూరంగా ఉండి ప్రయోజకరమైన చెట్లు నాటేందుకు ముందుకు రావాలని కోరారు. డా. బీఆర్ ఏయూను సందర్శించిన సందర్భంగా బోర్డు అధికారులను సత్కరించి జ్ఞాపికలను వీసీ అందజేశారు. కార్యక్రమంలో బోర్డు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారి కె.ప్రదీప్ కుమార్, వైస్-ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని, వర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య బి.అడ్డయ్య, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత, అకడమిక్ అఫైర్స్ డీన్ డా. కె.స్వప్నవాహిని, ఆర్ అండ్ డి డీన్ డా. ఎస్. లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దాతల సహాయం కోసం ఎదురుచూపులు

విశాలాంధ్ర - కవిటి: కవిటి మండలం కొండిపుట్టుగ గ్రామానికి చెందిన కొర్రాయి నీలయ్యది రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబం. ఆటో నడుపుతూ వచ్చిన ఆదాయంతో భార్యతోపాటు ముగ్గురు పిల్లల్ని పెంచి పోషించుకునేవాడు. ఆ కుటుంబంపై విధి కన్నెర్ర చేసింది. దీంతో పది సంవత్సరాల కిందట ఆ కుటుంబాన్ని పోషించే యజమాని కిడ్నీ వ్యాధి బారిన పడ్డాడు. ఇంతకాలం ఆర్థిక ఇబ్బందులతో చికిత్స చేయించుకుంటూ వచ్చాడు. కిడ్నీ వ్యాధి తీవ్రత ఎక్కువ కావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో కిడ్నీ మార్పిడి చేయించుకోమని వైద్యులు చెప్పారు. భర్తను బ్రతికించుకునేందుకు భార్య కిడ్నీ ఇవ్వడానికి ముందుకు వచ్చింది.చాలా వరకు అప్పులు చేశారు.కొంతవరకు గ్రామస్తులు, స్నేహితులు,దాతలు ఆర్థిక సహాయంతో వైజాగ్లో గల సెవెన్ హిల్స్ హాస్పిటల్లో కిడ్నీ మార్పిడి చికిత్స చేయించుకున్నారు.ప్రస్తుతం పేషంట్ నీలయ్యతో పాటు భార్య ఇద్దరు కూడా మంచాన పడ్డారు. దాతల సహకారం కోసం ఎదురు చూస్తున్నారు. పరిస్థితిని తెలుసుకున్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు వైజాగ్లో గల సెవెన్ హిల్స్ హాస్పిటల్ చేరుకొని రూ.15వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు.స్వచ్ఛందంగా సంస్థలు,దాతలు ఉదారంగా ముందుకు వచ్చి ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు. సహాయం చేయవలసిన దాతలు కొర్రాయి నీలయ్య ఫోన్ పే నెంబర్ 7032230841కు ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు.

ఐతంకు రీసెర్చ్ సెంటర్ గుర్తింపు

విశాలాంధ్ర-టెక్కలి: మండలంలోని ఐతం కళాశాల కు జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ విశ్వా విద్యాలయం జీవి నుంచి పరిశోధన కేంద్ర గుర్తింపు పునరుద్ధరణ జరిగిందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వివి. నాగేశ్వరరావు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గుర్తింపు పత్రాన్ని జేఎన్టీయూజీవీ ఉపకులపతి చేతుల మీదుగా ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్ మరియు గణితశాస్త్రం విభాగాలకు సంబంధించిన ధ్రువ పత్రాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎవిస్ శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ గుర్తింపు రెండు సంవత్సరాల కాలానికి వర్తిస్తుందని వివరించారు. ఇప్పటికే ఎంబిఏ, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, రసాయన శాస్త్రం మరియు భౌతిక శాస్త్రం విభాగాలకు రీసెర్చ్ సెంటర్లు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ కొత్త పునరుద్ధరణతో కలిపి మొత్తం తొమ్మిది విభాగాల పరిశోధన కేంద్రాల గుర్తింపు పొందడం కళాశాల ప్రతిష్ఠను మరింతగా పెంచిందని డైరెక్టర్ పేర్కొన్నారు. ఈ పరిశోధన కేంద్రం పిహెచ్డి మరియు ఇతర విద్యార్థులు,అధ్యాపకులు పరిశోధన, ఆవిష్కరణ, సాంకేతిక అభివృద్ధి రంగాల్లో ముందడుగు వేయడానికి ప్రేరణగా నిలుస్తాయన్నారు. ఈ గుర్తింపు సంస్థలో పరిశోధనా సంస్కృతిని మరింతగా బలోపేతం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా యాజమాన్య సభ్యులు కూడా తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ జేఎన్టీయూజీవీ నుండి లభించిన ఈ గుర్తింపు ఐతం యొక్క విద్యా ప్రమాణాలను, పరిశోధనాదిశలోని కృషిని మరింత స్థాయికి తీసుకెళ్తుందని అన్నారు.

డీన్ ఆర్ అండ్ డి డా. శ్రీరాములు, విభాగాధిపతులు డా.అశోక్, డా.వై రమేష్, డా.వి శ్రీహరి, డా.వి దినఖర్ లు మాట్లాడుతూ ఈ గుర్తింపు ద్వారా ఐతం కళాశాల పరిశోధన రంగంలో మరింత విశిష్టత సాధించి, భవిష్యత్ సాంకేతిక మరియు శాస్త్రీయ అభివృద్ధికి దోహదం చేస్తుందని పేర్కొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదు: తిలక్

విశాలాంధ్ర - సంతబొమ్మాళి: మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరించి, అనంతరం రాష్ట్ర గవర్నర్‌కు అందజేస్తామని వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ పేరాడ తిలక్ అన్నారు. స్థానిక జెడ్పీటీసీ పాల వసంత రెడ్డి సొంత పంచాయతీ అయిన హనుమంతునాయుడుపేట, యామల పేట, ఆకాశలక్కవరం గ్రామంలో శనివారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో తిలక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ ప్రజల ఓట్లతో ఎన్నో ఏళ్ళు గెలిచిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చం నాయుడు జిల్లాకు చేసిన అభివృద్ధి ఏమీ లేదని అన్నారు. మెడికల్ కళాశాలు ప్రైవేటీకరణతో పేద విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సంతబొమ్మాళి మండల పార్టీ అధ్యక్షుడు బుడ్డ మోహన్ రెడ్డి, వైసీపీ నాయకులు మార్పు నాగభూషణరావు, జగన్నాధపురం పంచాయతీ సర్పంచ్ జోగి రాములమ్మ, సంతబొమ్మాళి మండలం వైస్ ఎంపీపీ ప్రతినిధి నక్క భీమారావు, మూలపేట సర్పంచ్ జీరు బాబురావు, నౌపడ ఎంపీటీసీ బచ్చల సుధాకర్, శ్రీరాములు, కర్రీ కృష్ణారావు, పి.ధనంజయ, హనుమంతు నాయుడుపేట పంచాయతీ సర్పంచ్ గిన్ని ప్రకాష్, దల్లి చిన్న ఎర్రయ్య, వాసు, కొల్లిపాడు పంచాయతీ సర్పంచ్ గొరుసు సవరయ్య, కొల్లిపాడు ఎంపీటీసీ బొంగు కొండయ్య, ఎస్.జగదీష్ తదితరులు ఉన్నారు.

బాలీ యాత్ర ఏర్పాట్లను ఎమ్మెల్యే బగ్గు పరిశీలన

విశాలాంధ్ర- జలుమూరు/ నరసన్నపేట: నియోజకవర్గంలోని జలుమూరు మండలం, శ్రీముఖలింగం పుణ్యక్షేత్రంలో ఈనెల 9వ తేదీ నుండి ప్రారంభమయ్యే బాలీ యాత్రకు దేవాలయ కమిటీ పటిష్టమైన ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి, జిల్లా కలెక్టర్, స్వప్నిల్ దినకర్ పుండకర్ శనివారం సాయంత్రం పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే, రమణమూర్తి మాట్లాడుతూ బాలీ యాత్రకు వచ్చే భక్తులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, భక్తులు క్రమశిక్షణతో వ్యవహరించి శ్రీ ముఖలింగేశ్వర స్వామివారిని దర్శించుకోవాలని కోరారు. అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యే ఈ బాలీ యాత్ర ఆదివారం సాయంత్రం ప్రారంభమై, రాత్రి వరకు కొనసాగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఆర్డీవో, సాయి ప్రత్యూష, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్, రోణంకి కృష్ణంనాయుడు, జలుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్, తర్ర బలరాం, పంచాయతీ సర్పంచ్, తమన్నా గారి సతీష్, తహసిల్దార్, జె. రామారావు, నరసన్నపేట సర్కిల్ ఇన్స్పెక్టర్, ఎం శ్రీనివాసరావు, ఎస్సై, అశోక్ బాబు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : స్థానిక సత్యసాయి పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ భానుతేజ తెలిపారు. ఆదివారం విశాఖలో జరిగే రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు పాఠశాల విద్యార్థులు పాండవ ప్రణీత్, లాస్యశ్రీ ప్రధాన్, నవీన్ ఆచారి, కాళ్ళ జీవన్‌లు ఎంపికవ్వడం పట్ల యాజమాన్యం సంతోషాన్ని వ్యక్తం చేసి, విద్యార్థులను అభినందించింది. రాష్ట్ర స్థాయిలో జరిగే చందరంగం పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభతో ఉత్తమ స్థానాల్లో నిలవాలని కరస్పాండెంట్‌తో పాటు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రావు, పి.డి షాన్‌వాజ్ తదితర సిబ్బంది ఆకాంక్షించారు.

3వ సోమవారం స్థానిక సెలవుకు అవకాశం ఇవ్వాలి

విశాలాంధ్ర-ఆమదాలవలస: మూడవ సోమవారము ఉన్నత పాఠశాలలకు స్థానిక సెలవు ప్రకటించుకునే అవకాశం ఇవ్వాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న, ప్రధాన కార్యదర్శి పేడాడ క్రిష్ణారావులు ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రతి ఏడాది పవిత్రమైన మూడవ సోమవారం పాఠశాలలకు స్థానిక సెలవు ఇవ్వడం ఆనవాయితీగా వస్తున్నప్పటికీ అదేరోజు 6 నుంచి 10 వ తరగతి విద్యార్థులకు సమ్మేటివ్ తెలుగు పరీక్ష పెట్టడం సమంజసం కాదని అన్నారు. సమ్మేటివ్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభం అయ్యే విధంగా జిల్లా మరియు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అగ్రిగోల్డ్ ఏజెంటు మృతి

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం ఇద్దివానిపాలెం గ్రామానికి చెందిన గండుపల్లి గంగమ్మ అగ్రిగోల్డ్ కంపెనీలో ఏజెంటుగా పనిచేసి సుమారు రూ.10 కోట్లు కుమారుడు బాలకృష్ణ సహాయంతో కంపెనీలో ఇన్వెస్ట్ చేయడం జరిగింది. జనవరి 4వ తేదీ 2015 సంవత్సరంలో కంపెనీ బోర్డు తిప్పేయడంతో కస్టమర్లు వత్తిడి తట్టుకోలేక ఆమె మనస్తాపానికి లోనై అనారోగ్యంతో అక్టోబర్ 30న మరణించింది. విషయం తెలుసుకున్న కస్టమర్స్ అండ్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళా కార్యదర్శి పుక్కళ్ళ అరేలమ్మ వారి బృందం ఆమె గృహానికి వెళ్లి -సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కంపెనీ బోర్డు నేటికీ 11 సంవత్సరాలు అయినప్పటికీ ప్రభుత్వాలు దానిపైన సరేన నిర్ణయాలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి దుస్థితి ఏర్పడిందని అన్నారు. ఇప్పటికైనా ఈ కూటమీ ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులపై దయతలచి త్వరితిగతిగా బాధితులను ఆదుకొని న్యాయం చేయాలని కోరారు.అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకునే బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఇంకొక ప్రాణి ప్రాణం పోకుండా బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అండమాన్ మధు, ఈ. భాస్కరరావు, ఎస్.లక్ష్మీనారాయణ, ఎస్.సురేష్, డి.లోకనాథం, హరి పాత్రో తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ వద్ద ఉత్కంఠ..!

- మాజీ మంత్రి సీదిరికి 179 నోటీసు అందించిన పోలీసులు
- విచారణకు హాజరైన సీదిరి అప్పలరాజు

విశాలాంధ్ర - పలాస: పలాస నియోజకవర్గంలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. దీనికి తోడు పోలీస్ చర్యలు కూడా బలాన్ని ఇస్తున్నాయి. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును ఒక కేసుకు సంబంధించి విచారించేందుకు శుక్రవారం కాశీబుగ్గ పోలీసులు 179 నోటీసులు అందించి విచారణకు హాజరుకావాలని కోరారు. అదే విదంగా వైసీపీ పట్టణ అధ్యక్షులు శిష్టు గోపిపై ఇచ్చాపురం పోలీసులు కేసు నమోదు చేసి ఆయనకు కూడా నోటీసులు అందించినట్లు తెలుస్తుంది. ఈ మేరకు శనివారం మాజీ మంత్రి డా. సీదిరి అప్పలరాజు, పట్టణ అధ్యక్షుడితో పాటు ఇచ్చాపురం వెళ్లి పోలీస్ స్టేషన్ వద్ద హంగామా చేస్తారనే అనుమానంతో పోలీసులు మాజీ మంత్రి సీదిరిని ముందస్తు చర్యలలో భాగంగా శనివారం ఉదయం నుంచి హౌస్ అరెస్టు చేశారు. కాగా కాశీబుగ్గ సిఐ ఇంటికి వచ్చి మాజీ మంత్రిని విచారించి వాంగ్మూలం తీసుకుంటారని సమాచారం పోలీసులు నుంచి రావడంతో అప్పలరాజు కూడా హౌస్ అరెస్టులోనే ఉన్నారు. కానీ కాశీబుగ్గ సి.ఐ ఎప్పటికీ రాకపోవడంతో మధ్యాహ్నం అప్పలరాజు స్వయంగా కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎ.ఎస్.పి. పి.శ్రీనివాసరావు ముందు విచారణకు హాజర య్యారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఏడు గంటలు అవుతున్న మాజీ మంత్రి బయటకు రాకపోవడం, పోలీస్ స్టేషన్ వద్ద భారీగా పోలీసులు మోహరించి, గేట్లు వేసి ఉండడంతో ఏ క్షణాన అయిన మాజీ మంత్రి అప్పలరాజును అరెస్ట్ చేయవచ్చునని వైసీపీ నాయకులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. అయితే గతంలో మాజీ మంత్రి అప్పలరాజు ఓ సంఘటనపై ప్రభుత్వ, పోలీసులు తీరుపై చేసిన వ్యాఖ్యలపైనే ఆయనకు 179 నోటీసు అందించినట్లు తెలుస్తుంది. ఇది ఇలా ఉండగా డాక్టర్ సీదిరి అప్పలరాజుపై పలాస మండలం కిష్టపురం గ్రామానికి చెందిన బూర్లే విజయ కష్టంరాజు 2024లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అందజేసిన నోటీసులో వి ఎన్ ఎస్ 352,353డి. బి. 351లో 2,353లో 2 కింద కేసులు నమోదు చేసినట్లు నోటీసులో పొందుపరిచారు. పోలీసుల నోటీసులకు మాజీ మంత్రి డా. అప్పలరాజు స్పందిస్తూ మధ్యాహ్నం 4 గంటల సమయంలో కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. కాశీబుగ్గ ఎస్.ఐ. నరసింహమూర్తి డా. అప్పలరాజును రెండు గంటల పాటు విచారించారు. అనంతరం కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ కూడా విచారణను రాత్రి 8 గంటల వరకు కొనసాగించారు. డా. అప్పలరాజు కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో హాజరైన విషయాన్ని తెలుసుకున్న పార్టీ శ్రేణులు, వైసిపి కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. గతంలో కాశీబుగ్గకు చెందిన ఇద్దరు బాలికలపై జరిగిన సంఘటనను ఉద్దేశించి పోలీస్ స్టేషన్‌కు పసుపు రంగును వేయాలని అందుకు తాను ఆర్థిక సహాయం చేస్తానని అన్న వ్యాఖ్యలపై 2024లో కొంతమంది ఫిర్యాదు చేస్తే ఆ కేసుకు సంబంధించి ఇప్పుడు నోటీసులు జారీ చేయడం వెనుక ఆంతర్యం ఏమిటోనని వైసిపి కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. దీనిపై స్థానిక విలేకరులు వివరణ తీసుకునేందుకు ప్రయత్నించగా వారిని ఎవరిని పోలీస్ స్టేషన్‌లోకి అనుమతించకపోవడంతో వైసీపీ కార్యకర్తల్లో ఆందోళనల నెలకొంది.

మహారాజశ్రీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల సమస్యల పరిష్కార కమీషన్, విజయవాడ

I.A.No. 789/2025 in R.P. No. 61/2025

బిట్వీన్ :
కోటక్ మహీంద్రా లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ .... రివిజన్ పిటీషనర్
మరియు
కొణతల అన్నపూర్ణ & ఇతరులు .... ప్రతివాదులు
టు
ఆర్-3 : కొణతల కావేరి కుమారుడు అయిన (లేటు) కేశవరావు, నివాసి : లొద్దపుట్టి గ్రామం మరియు పోస్ట్, ఇచ్ఛాపురం మండలం, శ్రీకాకుళం జిల్లా - 532 312.
ఆర్-5 : ఫైవ్‌స్టార్ ఇన్సూరెన్స్ కంపెనీ ఇచ్ఛాపురం, దాని బ్రాంచ్ మేనేజర్ ప్రాతినిధ్యం వహిస్తారు. పీకేపేట, ఇచ్ఛాపురం మండలం- 532 312.

పై నెంబర్ పిటీషన్‌లో ప్రతివాదులు అయిన మీకు పై రాష్ట్ర కమీషన్ వారి ద్వారా నోటీసు పంపినాము. అది మీకు ముట్టనందున మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు చేయవలసినదిగా రాష్ట్ర కమీషన్ వారు ఆర్డరు వేస్తూ **ది.21-11-2025**కు వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా రోజు **ఉదయం గం॥ 10.30 ని॥** లకు మీరు స్వయంగా గాని లేక మీ అడ్వకేటు ద్వారా గాని పై కమీషన్ వారి ఎదుట హాజరై మీకు గల అక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల సదరు పిటీషన్‌ను మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.
(శ్రీ కమీషన్ వారి ఉత్తర్వుల ప్రకారము)

వాయిదా తేదీ 21-11-2025

పోట్ల సుఖవాణీ
రివిజన్ పిటీషనర్ తరపు న్యాయవాది
విజయవాడ, సెల్ : 8333863961

భక్తిశ్రద్ధలతో ఉసిరిక చెట్టుకు పూజలు

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం బెజ్జిపుట్టుగ నాయుడు గారి వీధిలో కార్తీకమాస వనభోజనాలు సందర్భంగా శనివారం ఉసిరిక చెట్టుకు అర్చకులు సత్యనారాయణ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వేకువజాము నుండే ఉసిరిక చెట్టు వద్ద లక్ష్మి నారాయణలకు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక వనభోజనాలు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అర్చకులు సత్యనారాయణ స్వామి మాట్లాడుతూ ఉసిరిక చెట్టు వద్ద విష్ణుమూర్తి కి 12 ,16, 21, దీపాలు వెలిగించి పూజించడం వల్ల ఆర్థిక బాధలు తొలగి సర్వ సంపదలు కలుగుతాయని భక్తుల నమ్మకం. కార్తీకమసంలో ఉసిరిక చెట్టును పూజించడం వల్ల ఎంతో పుణ్యఫలం లభిస్తుంది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అనంతరం ఉసిరిక చెట్టు కింద భక్తులు సహపంక్తి భోజనం చేశారు.

గిరిజనుల అభివృద్ధికి ఆటంకం గిరిజనుడే

-పనులు ఏదైనా కాసులు ఇవ్వాల్సిందే..!

విశాలాంధ్ర-పలాస: నాగరిక ప్రపంచానికి దూరంగా బ్రతుకుతున్న గిరిజనులకు ఒక గిరిజనుడే అభివృద్ధికి ఆటంకంగా తయారయ్యాడని పలాస మండలం హల్దీయా గిరిజన గ్రామానికి చెందిన గిరిజనులు సవర కుమార్, సవర ఢిల్లేశ్వరరావు, సవర ఆనంద్ లు ఆరోపిస్తున్నారు. తాము గతంలో కొండపైన 16 కుటుంబాలు నివసిస్తుండేవారమని ఆ ప్రాంతంలో త్రాగునీటికి ఇబ్బంది ఉండటం వలన కొండ దిగువకు వచ్చి పోరంబోకు స్థలంలో 1990 లో 16 గిరిజన కుటుంబాలు ఇల్లు నిర్మాణం చేసి నివసిస్తున్నామన్నారు. అయితే ఇటీవల ప్రభుత్వం నుండి అభివృద్ధి పనులు మంజూరు అయితే వాటి నిర్మాణాలకు దెర్లి గిరిజన గ్రామానికి చెందిన సవర రామకృష్ణ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వం 16 గిరిజన కుటుంబాలకు సర్వే నెంబర్ 5లో ఒక్కొక్కరికి రెండు ఎకరాలు చొప్పున పోడు వ్యవసాయం కోసం భూములు,ఒక్కొక్క ఇంటికి మూడు సెట్లు స్థలాన్ని, త్రాగు నీరు కోసం పది లక్షల రూపాయలు, ఒక్కొక్క ఇంటికి మూడు సెట్లు స్థలాన్ని మంజూరు చేశారని వాటిని కూడా అడ్డుకునే ప్రయత్నం చేశాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రామకృష్ణ తండ్రి సవర భరతో పెద్ద మనిషిగా వ్యవహరించే వాడని.. ఆయన మృతి చెందిన తర్వాత ఆయన కుమారుడు రామకృష్ణ తమ అభివృద్ధికి ఆటంకంగా తయారయ్యాడని ఆరోపించారు. తాము ప్రశ్నిస్తే నక్సలైట్ల సానుభూతిపరులుగా ముద్ర వేసి పోలీసులకు ఫిర్యాదు చేస్తుంటాడని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో ఎవరైనా ఇల్లు నిర్మించిన ఆటంక పరుస్తాడని, ఎవరైనా మృతి చెందితే దహన సంస్కార కార్యక్రమాలకు అడ్డగించి డబ్బులు ఇస్తే గాని ఆ శవాలను కాల్చనివ్వకుండా, గ్రామంలో ఉంచనివ్వకుండా చేస్తున్నాడని ఆరోపించారు. ఎవరైనా వ్యవసాయం చేయాలనుకున్న సమీప గొప్పిలి సంతలో వారితో పశువులను కొనిపించుకుంటాడని ఆరోపించారు. ఈ విధంగా కొన్ని సంవత్సరాలు రామకృష్ణ పెత్తనం చలాయిస్తున్నాడని ఆయన నుండి రక్షణ కల్పించాలని కోరుతున్నారు. ఇటీవల జొన్న సాయి గ్రామం నుండి హల్దియా గ్రామానికి రోడ్డు నిర్మాణానికి 40 లక్షల రూపాయలు నిధులు వాటితో నిర్మాణం పనులు చేపడుతుంటే కాంట్రాక్టర్ ను రామకృష్ణ బెదిరించి అడ్డుకున్నారని ఆరోపించారు. ఇటీవల గ్రామానికి చెందిన సవర ఢిల్లీశ్వరరావు ఈల నిర్మాణం చేపడితే వాటిని అడ్డుకొని 12 వేల రూపాయలు రామకృష్ణ కు చెల్లిస్తే గాని నిర్మాణానికి అనుమతించలేదని వారు వాపోయారు. రామకృష్ణ చేస్తున్న అరాచకాలను నిలువరించేందుకు ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

రెయ్యమ్మతల్లి సంబరాలు ప్రారంభం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి:సంతబొమ్మాళి మండలం గోవిందపురంలో ఆదివారం నుంచి మూడురోజులు పాటు రెయ్యమ్మతల్లి సంబరాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి గ్రామపంచాయతీ సర్పంచ్ రెయ్యి రామిరెడ్డి ఇంటి ఇలవేల్పు అయిన రెయ్యమ్మతల్లి సంబరాలు ప్రతిఏటా కార్తీకమాసం మూడో సోమవారం నుంచి మూడురోజులు పాటు నిర్వహిస్తారు. మొదటి రోజు ఆదివారం అమ్మవారి తిరువీధి తో ప్రారంభం కానున్న ఈసంబరాలు, అమ్మవారి ఘటాలు, ముర్రాటలు సమర్పించే కార్యక్రమాలు కన్నులు పండుగగా జరగనున్నాయి. ఈరెయ్యమ్మ సంబరాలకు, ఉత్తరంద్రజిల్లాల నలుమూలలు నుంచి కాకుండా, ఒడిస్సా, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారి కి మొక్కులు సమర్పించు కుంటారు. సంబరాలకు ఉత్సవాలు కమిటీ అధ్యక్షులు రెయ్యి ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయనున్నారు. ఈసందర్భంగా వలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీసభ్యులు తెలిపారు.

పాఠశాలలో పారిశుధ్య పనులు

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు: మండలం బైపలి ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం విద్యార్థి తల్లిదండ్రులచే పారిశుధ్య పనులు స్కూల్ చైర్మన్ తామాడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాలలో పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందనిఆయనఅన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విద్యార్థుల తల్లిదండ్రులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

వరాహ లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో లక్ష దీపార్చన

విశాలాంధ్ర - కొత్తూరు: కొత్తూరు దరి మహాసింగి గ్రామ పరిధి లొ వెలసిన శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయం లొ కార్తీకమాసం సందర్భంగా శనివారం ఘనంగా లక్ష దీపారాధన నిర్వహించారు పూజాలు చేసారు వచ్చిన భక్తులు కు అన్న ప్రసాదం సమాకూర్చారు ముందుస్తూ జాగ్రత్త గా భక్తులు కోసం మెడికల్ క్యాంపు నిర్వహించారు కమిటీ ముఖ్య భాద్యులు గోగుల వరప్రసాద్ నాయుడు ఆధ్వర్యంలో ఆలయం లొ భక్తులు రద్దీ కి అనువుగా క్యూ లైన్ ఏర్పాటు చేసారు మధ్యాహ్నం వేల ప్రవచనకర్త ఎలాల శ్రీనివాస్ రావు గారిచే ప్రవచనాలు చేసారు

సముద్ర తాబేలు రక్షణపై అవగాహన

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం కపాసుకుద్ది గ్రామంలో సముద్ర తాబేలు సంరక్షణపై మత్స్యకారులకు ట్రీ ఫౌండేషన్ సభ్యులు, అటవీశాఖ సిబ్బంది శనివారం వాటి రక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మత్స్యకారులు వేటాడేటప్పుడు వలలకు చిక్కిన తాబేలను సముద్రంలోకి ఎలా విడిచిపెట్టాలి అనేదానిపై తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రీ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ కె.సోమేశ్వర రావు, కుమార్, బడే లోకనాథం, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకించండి

- 12న వైసిపి ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-ఆమదాలవలస: పేదవారికినాణ్యమైన వైద్య సౌకర్యాలతో పాటు వైద్య విద్యను ప్రైవేటీకరణ చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని దీన్ని ప్రజలు వ్యతిరేకించాలని వైసీపీ సమన్వయకర్త డాక్టర్ చింతాడ రవికుమార్ అన్నారు. శనివారం స్థానిక వైఎస్ఆర్ కూడలి వద్ద మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కూటమి తీసుకున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజారోగ్య రంగం పూర్తిగా నిర్వీర్యం అవుతోందని ఆవేదన చెందారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తే ఆ గుత్తేదారు కేవలం లాభాలను దృష్టిలో పెట్టుకుని పనిచేస్తారే తప్ప మధ్యతరగతి పేద ప్రజలకు అనేక ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. ఇటువంటి ప్రజా వ్యతిరేక విధానాలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని అందుకే ప్రభుత్వ వైద్య రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరి పైన ఉందని అన్నారు. ప్రజా ఉద్యమం ద్వారా ప్రైవేటీకరణ నిలుపు చేయవచ్చని పిలుపునిచ్చారు.

12న వైసిపి ప్రజా ఉద్యమం ర్యాలీ...

రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గ కేంద్రంలో నవంబర్ 12వ తేదీన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతి రేకంగా ప్రజా ఉద్యమ ర్యాలీ నిర్వహించినట్లు సమ న్వయకర్త చింతాడ రవికుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి వైయస్సార్ కోడలు వద్ద ప్రజా ఉద్యమ ర్యాలీ పొస్టర్ ఆవిష్కరణ చేశారు. నియోజకవర్గం లోని వివిధ అనుబంధ విభాగాల సభ్యులు అధ్యక్ష కార్యదర్శులు పొందూరు, ఆముదాలవలస, బూర్జ, సరుబుజ్జిలి మండలాల ప్రతినిధులతో పాటు మండ లాల ప్రతినిధులతో పాటు పట్టణ ప్రతినిధులు కార్య కర్తలు అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కోటి సంతకాల కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రవికుమార్, బూర్జ ప్రతి నిధులు ఖండాపు గోవిందరావు, పట్టణ అధ్యక్షులు పొదుగు శ్రీనివాసరావు, దుంపల శ్యామల రావు, మామిడి రమేష్, చిన్నారావు, రామకృష్ణ, సి హెచ్ వెంకటరమణ, బి వెంకటరమణ, ఏ కృష్ణ, ఎస్ రామారావు, బి వీఎస్ నాయుడు, మామిడి ప్రభాకర్ రావు, బొడ్డేపల్లి రాజు తదితరులు ఉన్నారు.

పారిశ్రామికవేత్త గుంటి వేణుకు ఘన సన్మానం

విశాలాంధ్ర-పలాస: ఛత్తీస్గఢ్ తెలుగు మహా సంఘం ఉపాధ్యక్షుడు,భిలాయి తెలుగు సమాజ్ అధ్యక్షుడు బర్రి జోగారావు నేతృత్వంలో శనివారం ఇండియన్ కాఫీ హౌస్,సుపేలాలో ప్రముఖ పారిశ్రామికవేత్త(కాండ్లా-గుజరాత్) గుంటి వేణు గోపాల రావుకు భిలాయిలో వివిధ గ్రామ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. భిలాయి తెలుగు సమాజ్ అధ్యక్షుడు బర్రి జోగారావు సన్మాన గ్రహీత గుంటి వేణు గోపాల రావు ను దుశ్శాలువ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఛత్తీస్ ఘఢ్ తెలుగు మహా సంఘం సలహాదారుడు,వాడబలిజ జాతీయ సంఘం భిలాయి సంస్థాపక మండలి ప్రముఖుడు మొరిపల్లి బాబూరావు,వాడబలిజ జాతీయ సంఘం భిలాయి అధ్యక్షుడు డా ఎల్ జగన్నాథ్ రావు, ఆంధ్ర స్వాభిమాన్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్రి ఉమా శంకర్ రావు, డోకులపాడు శ్రీ గంగాధర సేవా సంఘం అధ్యక్షుడు మద్దు పాపారావు,వంకులూరు ఆదిబలిజ సంఘం అధ్యక్షుడు నేతాడ ప్రభాకర్,వాడబలిజ జాతీయ సంఘం ప్రధాన కార్యదర్శి కొండప్ప కూర్మారావు, కోశాధికారి వాసుపల్లి యోగి రత్నం, వంకులూరు ఆదిబలిజ సంఘం పూర్వ అధ్యక్షుడు, ఛత్తీస్గఢ్ తెలుగు మహా సంఘం కార్యవర్గ సభ్యుడు, రంగస్థలం మరియు సినిమా నటుడు కొండప్ప వెంకట రావు, శ్రీ సాయినాథ్ సామాజిక సమితి అధ్యక్షుడు గండుపల్లి మాధవ్ రావు,వాడబలిజ జాతీయ సంఘం సంయుక్త కార్యదర్శి బైపల్లి దేవదాసు, కార్యవర్గ సభ్యుడు కొవిరి ముకేష్ కుమార్,బైపల్లి యువజన సేవా సంఘం భిలాయి సలహాదారుడు మొరిపల్లి ధర్మారావు, పూర్వ ప్రధాన కార్యదర్శి మద్దు తమ్మారావు, వంకులూరు -మెట్టూరు పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి అప్పారావు, బైపల్లి అప్పారావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత గుంటి వేణు మాట్లాడుతూ ఏ సంఘంలో కూడా సభ్యుల్లో బేధాభిప్రాయాలు ఉండకూడదని,సభ్యుల మధ్య ఐక్యత భావం నిత్యం నెలకొనాలని, అప్పుడే సరైన అభివృద్ధి సాధ్యమని అన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోగలమని, ఆ దిశలో భిలాయి సంఘాలు కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ సభలో ప్రిన్సిపాల్ మొరిపల్లి బాబూరావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

అండర్ 19 క్రికెట్ లో 'శర్వాణి' విద్యార్థిని ప్రతిభ

జిల్లా ఖ్యాతిని చాటాలి శర్వాణి విద్యాసంస్థల వ్యవస్థాపకులు అంధవరపు సూరిబాబు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: అరసవిల్లి రోడ్ లో గల శర్వాణి విద్యాలయలో 9వ తరగతి చదువుతున్న తమ్మిరాజు చర్విశ్రీ అండర్ 19 క్రికెట్ స్టేట్ టీం కు శ్రీకాకుళం జిల్లా తరఫున ఎంపికెంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి టోర్నమెంట్ కు జరిగిన ఈ ఎంపికల్లో జిల్లా నుండి అండర్ 19 జట్టుకు ఎంపికెన ఏకైక క్రీడాకారిణిగా చెర్విశ్రీ నిలిచింది. విశాఖ, విజయనగరంలో నిర్వహించిన ఎంపిక మ్యాచుల్లో మొదటి మ్యాచ్ లో 20 బంతుల్లో 29 పరుగులు చేసి 2 వికెట్లు తీసింది. రెండవ మ్యాచ్ లో 30 బంతుల్లో 23 పరుగులు చేసి సత్తా చాటింది. త్వరలోనే జరగనున్న జాతీయ స్థాయి టోర్నమెంట్ లో ఆంధ్రప్రదేశ్ టీంలో చర్విశ్రీ ఆడనుంది. ఈ సందర్భంగా శర్వాణి విద్యాసంస్థల వ్యవస్థాపకులు అంధవరపు సూరిబాబు, విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించారు. విద్యతో పాటు క్రీడల్లో సైతం తమ విద్యార్థులు ప్రతిభ కనబరచడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో అద్భుతంగా రాణించి జిల్లా ఖ్యాతిని దేశం నలుమూలలా చాటాలని అభిలషించారు. పాఠశాల కరస్పాండెంట్ అందవరపు ఆంజనేయులు మాట్లాడుతూ చెర్విని ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో సైతం విద్యార్థినీ విద్యార్థులు ముందుకెళ్ళాలని, శర్వాణి సంస్థ అందుకు తగిన ప్రోత్సాహం తన విద్యార్థులకు అందిస్తుందన్నారు. హెడ్ మిస్ట్రెస్ కె.రేఖ, విద్యార్థినిని అభినందిస్తూ చర్విశ్రీ అంతర్జాతీయ స్థాయి క్రికెటర్ గా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు చెర్విశ్రీ కి అభినందనలు తెలియజేసారు.

పేదలకు వైద్య విద్యను దూరం చేస్తే సహించం

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దుర్మార్గం

విశాలాంధ్ర-మందస: రాష్ట్రంలో పేదలందరికీ ఉచిత వైద్య విద్యను అందించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేస్తే కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేట్ వరం చేయడానికి పూనుకోవడం దుర్మార్గమని వైఎస్ఆర్సిపి మందస మండలం నేతలు ధ్వజమెత్తారు. శనివారం మందస మండలం బేతాళ పురం గ్రామంలో సర్పంచ్ మామిడి సింహాద్రి ఆధ్వర్యంలో వైయస్సార్సీపి రచ్చబండ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బాలిగాం పిఎసిఎస్ పూర్వ అధ్యక్షులు సౌర ఢిల్లీ శ్వరరావు మాట్లాడుతూ, పేదలకు వైద్య విద్యను దూరం చేస్తే సహించేది లేదని, చంద్రబాబు రాష్ట్రంలో ప్రభుత్వం మెడికల్ కాలేజీలను తన బినామీలకు కట్టబెట్టే ఉద్దేశంతో ప్రైవేటీకరణ జపం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. గత వైసిపి ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేసి మెడికల్ కాలేజీ భవనాలు నిర్మించి, వేలాది ఎకరాల భూమిని కేటాయిస్తే, వాటిని ప్రైవేట్ వ్యక్తులకు ఎలా అప్పగిస్తారని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్తులను పప్పు బెల్లాలుగా పంచుకోవాలని చూస్తే, గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఏడాదిన్నర కాలంలోనే కూటమి ప్రభుత్వ పాలనపై అన్ని వర్గాలు తీవ్ర అసంతృప్తి తో ఉన్నారని ఆయన విమర్శించారు. జగనన్న చేసిన మంచి పనులను కొనసాగించలేని దౌర్భాగ్య స్థితిలో చంద్రబాబు ప్రభుత్వం ఉందని ఆయన మండిపడ్డారు. మోసపూరిత మాటలతో అధికారంలోకి వచ్చిన కూటమి పాలకులు మహిళలకు నెలకు 1500 రూపాయలు, 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు నెలకు నాలుగు వేల రూపాయలు చొప్పున పింఛన్, నిరుద్యోగ భృతి నెలకు 3000 రూపాయలు ఇస్తామన్న హామీలు ఏమైనాయని ఆయన ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా ప్రభుత్వ మెడికల్ కళాశాల ల విషయంలో వెనక్కు తగ్గి ప్రైవేటీకరణ జపాన్ని మానుకొని.. ప్రభుత్వ ఆధ్వర్యంలో వైద్య కళాశాలలు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి మండల శాఖ అధ్యక్షులు దల్లి జానకి రెడ్డి, వైయస్సార్సీపి జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి మడియ రామకృష్ణ, వైయస్సార్ ఉద్యాన వర్సిటీ పాలకమండలి మాజీ సభ్యులు బత్తిన లక్ష్మణ్, వైసీపీ నేతలు హరికృష్ణ, కపిల్, రాపాక శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

అంచలంచెలుగా ఎదిగిన వ్యక్తి పీఎంజే బాబు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: అంచలంచెలుగా ఎదిగిన వ్యక్తి పీఎంజే బాబు అని పలువురు రాజకీయ, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల వక్తలు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఇలిసిపురంలోని అంబేద్కర్ విజ్ఞాన్ మందిర్లో ఆంధ్రప్రదేశ్ విద్య, సంక్షేమ, మౌలిక వసుతుల, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ గా రాష్ట్ర ప్రభుత్వం నియమితులైన పిఎంజె బాబుకు ఆత్మీయ అభినందన సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే సతీమణి గోండు స్వాతి శంకర్ , మున్సిపల్ మాజీ చైర్పర్సన్ పైడిశెట్టి జయంతి, టిడిపి సీనియర్ నాయకులు మొదలవలస చిరంజీవి, వంశధార ప్రాజెక్టు కమిటీ చైర్మన్ అరవల రవీంద్రలు మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం కోసం ఎనలేని సేవలు అందించారన్నారు. అణగారిన వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం కట్టుబడిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని పేర్కొన్నారు. పీఎంజే బాబుకు ఈ పదవి సముచితం కాదయినప్పటికీ భవిష్యత్తులో తెలుగుదేశం పార్టీ గుర్తించి అత్యున్నతమైన పదవిని ఇస్తుందని వక్తలు ఆశాభావం వ్యక్తం చేశారు. దివంగత నేత కింజరాపు ఎర్రం నాయుడు పీఎంజే బాబుకు తన విధులకు రాజీనామా చేసి వచ్చినట్లయితే ఎమ్మెల్యే టికెట్ ఇచ్చేందుకు ఆస్కారం కల్పించినప్పటికీ తన విధులకే ప్రాధాన్యత ఇచ్చిన మహోన్నత వ్యక్తి బాబు అని కొనియాడారు. సన్మాన గ్రహీత, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పిఎంజె బాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో అప్పగించిన బాధ్యతలు తూచా తప్పకుండా పాటిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ ఉపాధ్యాయ ఉపాధ్యాయ సంఘాల జేఏసీ చైర్మన్, కార్యక్రమ సభ అధ్యక్షులు పోతల దుర్గారావు, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ గంజి ఆర్ ఎజ్రా, ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, శ్రీకాకుళం తాసిల్దార్ గణపతి రావు, కె ఎన్ పి ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్కా కృష్ణయ్య, టిడిపి సీనియర్ నాయకులు ప్రధాన విజయరాం, అంతవరకు సంతోష్, గుర్రాల చిన్నబాబు, చల్ల రామారావు, లింగాల గరికవాడు, నూతలపాటి భరత్ భూషణ్, సీనియర్ జర్నలిస్ట్ విన్నింటి అప్పన్న, లోపింటి నారాయణరావు తో పాటు పలువురు దళిత సంఘ నాయకులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు వినియోగించుకోవాలి

పిఎసిఎస్ చైర్మన్ కాంతారావు

విశాలాంధ్ర -సంతబొమ్మాళి: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని సంతబొమ్మాళి పిఎసిఎస్ చైర్మన్ కూచెట్టి కాంతారావు అన్నారు. మండల కేంద్రం సంతబొమ్మాళి వారిలో శనివారం జరిగిన ఉచితమెగా మెడికల్ క్యాంప్ లో 356 మందికి చికిత్సలు నిర్వహించారు. జేమ్స్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సోయాబ్ డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో రోగులను పరీక్షించి వారికి ఉచితంగా మందులు అందించారు. తొలితీ శిబిరాన్ని స్థానిక గ్రామ పెద్దలు పిఎసిఎస్ అధ్యక్షులు కూచెట్టి కాంతారావు గ్రామ సర్పంచ్ కళింగపట్నం లక్ష్మి లాంఛనంగా ప్రారంభించారు. ఈశిబిరంలో అన్నిరకాల పరీక్షలు నిర్వహించి 23 మందిని ఆసుపత్రికి చికిత్స కోసం రిఫర్ చేశారు. ఈ శిబిరంలో స్థానిక సంతబొమ్మాళి మాజీ సర్పంచ్ మెండ అప్పారావు, గ్రామ పెద్దలు కళింగ పట్నం అప్పారావు, పప్పు కృష్ణారావు, స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సేవలు అందించారు.

సంతబొమ్మాళి లో కార్తీక వనభోజనాలు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి:మండల కేంద్రమైన సంతబొమ్మాళి లో కార్తీక మాసంవనభోజనాలు శనివారంఘనంగా నిర్వహించారు. స్థానిక ఖాదీబండారుఆవరణలో రావి, ఉసిరికి, మారేడు, వేప, తులసి చెట్లుకు కార్తీక మాసం లో భక్తులు నిత్యదీపారాధనచేస్తూ పూజలు నిర్వహిస్తారు. ఈసందర్భంగా ప్రతిఏటా కమిటీ సభ్యులు కార్తీక మాసం వనభోజనాలు నిర్వహిస్తారు. గ్రామస్తులు, భక్తులు సహకారం తో పెద్దఎత్తున నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం లో వేలాదిమందిభక్తులు పాల్గొని వనభోజనాలు లో ప్రసాదం ఆరగించారు. ఈకార్యక్రమాన్ని మండల పిఎసిఎస్ చైర్మన్ కూచెట్టి కాంతారావు, మాజీ సర్పంచ్ మెండ అప్పారావు, మాజీ ఎంపీటీసీ ప్రతినిధి పప్పు కృష్ణమూర్తి, కొన్న వీరాస్వామి, కొండాలసోమేశ్వరావు, కుసుమూ రు లక్ష్మణరావు, పప్పు శ్రీరాములు పలువురు మహిళలు, యువతీ యువకులు పూర్తి సహకారం అందించారు. ఈ సందర్భంగా భజనబృందం సభ్యులకు భక్తులకు ఘనంగాసన్మానం చేశారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఏపీ టీపీసీ చైర్మన్ బాబురావు

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు వైపు దృష్టి సారించాలని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రస్థాయి 69వ అథ్లెటిక్స్ స్కూల్ గేమ్స్ పోటీలను శనివారం వజ్రపుకొత్తూరు మండలం పూండి గోవిందపురం హైస్కూల్లో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 13 జిల్లాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని వారి ఆట తీరులో ప్రతిభను కనబర్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర ట్రేడింగ్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జబాబు రావు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు జాతి సమైక్యత కు దోహదపడుతుందని అన్నారు. ఈ ఇంటర్నెట్ యుగంలో కూడా క్రీడల పట్ల విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారంటే వారి వెనుక పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు కృషి ఎంతో ఉందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ లోని 13 ఉమ్మడి జిల్లాల నుండి వచ్చిన క్రీడాకారులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్ లో మరింత ఉన్నత స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ అథ్లెటిక్స్ సిబ్బంది, హై స్కూల్ ఉపాధ్యాయులు మరియు వజ్రపు కొత్తూరు మండలంలో వివిధ హోదాలలో ఉన్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల్లో చైతన్యం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి "సప్తశక్తి సంగం"



విశాలాంధ్ర -కవిటి: మహిళల్లో చైతన్యం,నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి "సప్తశక్తి సంగం" కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వైద్యులు అనురాధ అన్నారు. ఈ మేరకు శనివారం జగతి గ్రామంలో గల భారతీయ విద్యద్యాకేంద్రం వారి పూడి వెంకట రమణమ్మ విజ్ఞాన భారతి ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రబంధకారిణి పూడి నందిని అధ్యక్షతన సప్తశక్తి సంగం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంనకు ముఖ్య అతిథిగా అనురాధ పాల్గొని మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణించాలని దానికి ఉదాహరణ మహిళల ప్రపంచ కప్ దేశంతరుపున గెలుపొందడమే అని అన్నారు. భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు ఆలోచనను ఇంటింటికీ చేరవేసి,3.5 కోట్ల కుటుంబాలతో మమేకం కావడమే దీని ముఖ్య ఉద్దేశ్యం అని అన్నారు. అనంతరం పాఠశాల స్థలదాత వారసులు పూడి లక్ష్మమ్మ ,పాఠశాల పూర్వ విద్యార్థిని జాతీయ క్యారమ్స్ క్రీడాకారిణి లమ్మత హరిప్రియలకు పాఠశాల సిబ్బంది, ప్రబంధకారిణి సభ్యులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తలు సూర్ని మోహినమ్మ, రాష్ట్రీయ సేవక సమితి జిల్లా కార్యవాహ బైరెడ్డి మణి,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ

విశాలాంధ్ర- నరసన్నపేట: నియోజకవర్గ వైసిపి ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కోటి సంతకాల సేకరణ విజయవంతమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీకాకుళం వైసిపి జిల్లా అధ్యక్షులు, ధర్మాన కృష్ణ దాస్, పోలాకి జడ్పిటిసి, డా.ధర్మాన కృష్ణ చైతన్య స్థానిక కళాశాల జంక్షన్ సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం కృష్ణ దాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించమన్నారు,ఈ సందర్భంగా విద్యార్థులు, నిరుద్యోగులు, కార్మిక, కర్షకులు, మహిళలు హాజరై, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, ఆరంగి మురలీధర్, మేజర్ పంచాయతీ సర్పంచ్ బురల్లి శంకరరావు, వైసిపి నాయకులు, కెసిహెచ్చి గుప్తా, దండి జయప్రకాష్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు, కల్లేపల్లి లక్ష్మణరావు, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు, సతివాడ రామనాయుడు, నరసన్నపేట ఎస్సీ సెల్ అధ్యక్షులు, నాగవంశం శ్రీనివాసరావు, పోలాకి మండలం ఎస్సీ సెల్ అధ్యక్షులు, తలసముద్రం గద్దయ్య, జలుమూరు మండలం ఎస్సీ సెల్ అధ్యక్షులు, నవిరి పోతయ్య, సారవకోట మండలం ఎస్సీ సెల్ అధ్యక్షులు, కే. శంకర్రావు తోపాటు ఎస్సీ సెల్ కార్యవర్గ సభ్యులు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.